ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023 5 అనంతపురం





రామస్వామి రోడ్డులో నిలిచిన వర్షం నీరు

రాయదుర్గంలో ఈదురుగాలుల వర్షం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలు, ఉరుములతో కూడిన వర్షం పడింది. పెద్దపెద్ద శబ్దాలతో ఉరుములు ఉరిమాయి. వర్షం దెబ్బకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కొలిమి వీధి, మధు టాకీస్ ఏరియాలు జలమయం అయ్యాయి. డ్రైయినేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల వర్షం నీటికి మురుగు నీరు తోడై లోతట్టు ప్రాంతాల్లోకి చేరాయి. లక్ష్మీబజార్ ప్రధాన రోడ్డుపై నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. విపరీతమైన ఈదురు గాలులు వీచడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాయదుర్గం మండల పరిధిలోని రాయంపల్లి గ్రామంలో నాగరాజు అనే వ్యక్తికి సంబంధించిన కోళ్ల ఫారం షెడ్డు రేకులు గాలికి ఎగిరి పోయాయి. 50 కోళ్లు మతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. రెండు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెప్పాడు.

నేడు రైతుభరోసా

రూ.158 కోట్లు రైతుల ఖాతాల్లోకి



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను జమ చేయనుంది. రైతు భరోసా కింద రూ.7500 ఒక్కో రైతు ఖాతాకు జమ చేయనుంది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని కర్నూలు జిల్లాలో ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లాలోనూ రైతు భరోసా నిధుల విడుదల సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కాస్త ఊరట

మే నెలలో వర్షాలొస్తుండటంతో రైతులు దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాల పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. అయితే చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు కూడా కొనలేక అవస్థలు పడుతున్నారు. మే నెలలో ప్రతి ఏటా ఇచ్చే రైతు భరోసాపైనా ప్రకటనలేకుండా ఉండింది. ఇటువంటి సమయంలో శుక్రవారం నాడు ప్రభుత్వం రైతు భరోసా ఈనెల 30వ తేదిన ఇవ్వడానికి సిద్ధపడినట్లు ప్రకటన వచ్చింది. తరువాత రెండు రోజుల మార్పు తరువాత జూన్ ఒకటవ తేదికి మార్పు జరిగింది. సీజన్ ప్రారంభంలో భరోసా సాయం ఇవ్వడం రైతులకు కాస్త ఊరట లభించినట్టయింది. మొదటి విడత కింద ఇచ్చే రూ.7500 ఒక్కో రైతుకు ఇవ్వనున్నారు. దీంతో విత్తనాలు, దుక్కుల వరకైనా కొంత ఊరట లభించే అవకాశముంది.

అందనున్న రూ.158 కోట్లు

అనంతపురం జిల్లా వరకు చూస్తే 2,87,479 మంది రైతులు రైతు భరోసా కింద అర్హులుగానున్నారు. వీరందరికి కలిపి మొత్తం రూ.158.74 కోట్లు రైతు భరోసా కింద జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా లబ్ధిదారుల జాబితాలు సైతం సిద్ధం చేసియున్నారు. నియోజకవర్గాల వారీగా సైతం జాబితాలు సిద్ధంగానున్నాయి. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో మొత్తం 29381 మంద రైతులు ఉన్నారు. వీరికి రూ.16.15 కోట్లు . కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 53896 మంది రైతులకు రూ.29.64, రాప్తాడు నియోజకవర్గం పరిధిలో 24141 మంది రైతులకు రూ.13.27 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో రూ.44655 మంది రైతులకు రూ.24.56 కోట్లు, శింగనమల నియోజకవర్గం పరిధిలో 53635 మంది రైతులకు రూ.29.49 కోట్లు, తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో 31923 మంది రైతులకు రూ.17.55 కోట్లు, ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 49848 మంది రైతులకు రూ.27.41 కోట్లు రైతు భరోసా కింద రైతులకు సహాయం అందనుంది. దీంతోపాటు జనవరి నుంచి ఏప్రిల్, మే మాసాల్లో వడగండ్ల, గాలులకు పంటలు, ఉద్యానవన పంటలు రెండు దెబ్బతిన్నాయి. వీటికి సంబందించి కూడా పరిహారాన్ని రూ.8 కోట్ల వరకు జిల్లాకు రానుంది. దీంతపాటు పరిహారం కూడా అందించనున్నారు.

4,616 క్వింటాళ్లు పంపిణీ : జెడిఎ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 5129 మంది రైతులకు 4,616 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాన్ని పంపిణీ చేసినట్లు జెడిఎ బి.చంద్రానాయక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తన కాయలు అందిస్తామని చెప్పారు. వేరుశనగ కాయల కోసం రైతుభరోసా కేంద్రాల్లో 47,862 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. రైతులు పేర్లు నమోదు చేసుకున్న ప్రకారం 42,209 క్వింటాళ్ల వేరుశనగ కాయలు అవసరం అవుతాయని, ఈ మేరకు విత్తన కాయలను తెప్పిస్తున్నట్లు చెప్పారు.

అనంత ఎస్ఆర్ఐటిలో ఫుడ్‌పాయిజన్ కలకలం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రాత్రి ఫుడ్‌పాయిజన్ కలకలం రేగింది. హాస్టల్‌లో రాత్రి భోజనం తిన్న 86 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. మంగళవారం రాత్రి హాస్టళ్లో తిన్న భోజనం వల్లే ఫుడ్‌పాయిజన్ అయ్యిందని విద్యార్థులు చెబుతున్నారు. కాగ ఈ ప్రమాదంలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పింది.

వార్త మెయిన్‌లో..

ఎస్ఆర్ఐటి యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యార్థుల ఫుడ్‌పాయిజన్‌కు గురై ఆసుపత్రుల పాలయ్యేందుకు కారణమైన బుక్కరాయముద్రం ఎస్ఆర్ఐటి కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. అనంతపురం నగరానికి కూత వేటు దూరంలో ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి 86 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారంపై ఎస్ఆర్ఐటి కళాశాల యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంభించిందన్నారు. శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర విద్యా శాఖ సలహాదారుగా ఉన్న ఆలూరు సాంబశివా రెడ్డి భాగస్వామ్యంతో నడిచే ఈ కళాశాలలో ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం విచాకరం అన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కేవలం డబ్బే లక్ష్యంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదన్నారు. లక్షలాది రూపాయల ఫీజులను రూపంలో తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. ఎస్ఆర్ఐటి కళాశాల యాజమాన్యం అధికారమదంతో పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి ఎస్ఆర్ఐటి కళాశాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి

ఏళ్ల తరబడి మున్సిపల్ కార్మికులతో వెట్టిచాకిరీ

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్

అనంతకు చేరుకున్న 'మున్సిపల్' ప్రచార జాతా



అనంతపరం జీపుజాతాలో మాట్లాడుతున్న నూర్‌మహ్మద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని, అన్ని సదుపాయాలు వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం నాయకత్వంలో బుధవారం హిందూపురం నుంచి విజయవాడ వరకు చేపట్టిన ప్రచార జాతా అనంతపురం పట్టణానికి చేరుకుంది. హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం మీదుగా అనంతపురానికి జీపుజాతా రాత్రి 7 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగర పాలక సంస్థ ఎదుట బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్ మహమ్మద్, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, ఏటిఎం.నాగరాజు హాజరై మాట్లాడారు. కార్మికుల శ్రమ శక్తిని ప్రభుత్వం దోపిడి చేస్తోందన్నారు. నైపుణ్యంతో కూడిన విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బందికి పారిశుధ్య విభాగం వారి కన్నా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులరైజేషన్ చేస్తామని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా కేవలం ఆప్కాస్‌లో చేర్చి మిన్నకుండిపోయారని తెలిపారు. పర్యావరణాన్ని ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చెయ్యకుండా ఆప్కాస్ అనే బానిస వ్యవస్థలోకి నెట్టివేశారని తెలిపారు. లక్ష రూపాయలు ఇచ్చినా మున్సిపల్ కార్మికులు చేసే పనిని ఇతరులెవ్వరూ చేయలేరని చెప్పిన ముఖ్యమంత్రి రూ.12 వేల జీతాన్ని కేవలం రూ.15 వేలకు పెంచారని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ కింద నెలకు రూ.6 వేలు ఇచ్చారు తప్ప సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చెయ్యలేదు. ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను ఎత్తివేశారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నప్పటకి హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించడంలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. లేకుంటే కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, నగర అధ్యక్షులు గురురాజు, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి నాగార్జున, రాష్ట్ర నాయకురాలు లక్ష్మినరసమ్మ, శేషాద్రి, కుమార్, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు బృందం పాల్గొన్నారు.

వార్డు శానిటేషన్ సెక్రటరీలపై పనిభారం తగ్గించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా అనంత కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న వార్డు శానిటేషన్ కార్యదర్శులకు పని భారం తగ్గించి, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తింప చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగబూషణం డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్యదర్శులకు పని భారం పెరిగి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వీరిపై పని భారం తగ్గించాల్సి ఉందన్నారు. జాబ్‌చార్ట్‌లో లేని పనులనూ వారితో చేయించుకుంటున్నారని చెప్పారు. దీంతో చాలా మంది ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ముగ్గురు శానిటేషన్ కార్యదర్శులు మృతి చెందారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్లాప్ కార్యక్రమంలో యూజర్ ఛార్జీలు వసూళ్ల బాధ్యత కూడా వీరిపై ఉంచడంతో పాటు దినసరి వసూళ్ల టార్గెట్ విధిస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి వార్డు శానిటేషన్ సెక్రటరీలపై పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పరస్పర సహకారంతో యూనివర్సిటీల అభివృద్ధి

జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

యూనివర్సిటీలు పరస్పర సహకారంతో అన్ని రంగాల్లో అభివద్ధి సాధించాలని రాయలసీమ రీజనల్ క్లస్టర్ యూనివర్సిటీల కన్వనర్, జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. బుధవారం స్థానిక వర్శిటీ ఉపకులపతి సమావేశ హాల్లో రాయలసీమ క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1,2వ తేదీల్లో కాకినాడ జెఎన్‌టియులో ఐదవ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళికా సంఘం సమావేశం జరుగుతోందని చెప్పారు. అందుకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి చర్చించేందుకు రీజనల్ క్లస్టర్ గ్రూపు సమావేశం అనంతపురం జెఎన్‌టియులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక సంఘం సహకారంతో విశ్వవిద్యాలయాలు అనుబంధంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రీజనల్ క్లస్టర్ భాగస్వామ్యం విశ్వవిద్యాలయాల నడుమ పరస్పర సహకారంతో పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రెక్టార్ ఎం.విజయ కుమార్ మాట్లాడుతూ రీజినల్ క్లస్టర్ గ్రూపు అనంతపురంలో భాగస్వాములుగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలు వారు నిర్వహించిన పలు కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు పొటోలతో సహా జతపరచి పంపించాలని ఎస్‌కెయు విసి ఎం.రామకష్ణా రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రతిష్టాత్మకంగా కాకినాడలో నిర్వహించనున్న వ్యవస్థాపక, ఆవిష్కరణల సదస్సు విజయవంతం అయ్యేందుకు అందరూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వర్శిటీ ఉపకులపతి ఎ.ఆనందరావు, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుంధరానంద్, సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి యస్.ఎ.కోరి, క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి డివిఆర్. సాయిగోపాల్ , ఉర్దూ యూనివర్సిటీ కర్నూల్ ఉపకులపతి ఫజుల్ రెహమాన్, సత్యసాయి యూనివర్సిటీ ఉపకులపతి సాయిగిరిధర్, కర్నూల్ యూనివర్సిటీ ఉపకులపతి సోమయాజులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

5న జిల్లా స్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రపంచ విప్లవకారుడు చెగువేరా 95వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన అనంత ఆర్ట్స్ కళాశాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో చెస్ ఆట పట్ల ఆసక్తి ఉన్న వారు ఎవరైనా ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలో పాల్గొనే వారికి ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. కేవలం వారిలోని ప్రతిభను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం, గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొనే వారు ఈ నెల 4వ తేదీ లోపు వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9700386070, 9182216213 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలక్రిష్ణ, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

3, 4న గుత్తిలో జెవివి వైజ్ఞానిక తరగతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జూన్ 3, 4వ తేదీల్లో జన విజ్ఞాన వేదిక వైజ్ఞానిక తరగతులను గుత్తిలో నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. బుధవారం జెవివి కార్యాలయంలో డార్విన్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 3, 4వ తేదీల్లో గుత్తి పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీలో జెవివి వైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జెవివి స్థానిక కమిటీల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. డార్విన్‌ను పాఠ్య ప్రణాళిక నుంచి తొలగించకూడదని కరపత్రాలు రూపొంచి ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైజ్ఞానిక తరగతుల్లో ఈ అంశంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. శాస్త్రీయ దక్పథం, విశ్వ ఆవిర్భావం, ప్రకతి సూత్రాలు, పరిణామ వాదం, సైన్స్ చరిత్ర వంటి అంశాలపై ఈ తరగతుల్లో బోధిస్తారని తెలియజేశారు. విద్యా వైద్య రంగాలలో, శాస్త్ర ప్రచార రంగంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై వైజ్ఞానిక తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ తరగతులకు తనతో పాటు, కేంద్ర అకాడమీ అవార్డు గ్రహిత ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఐటి.రామ్మూర్తి, డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ రంగన్న, అమర్‌నాథ్ రెడ్డి, జిలాని, రామాంజనేయులు, మహేంద్ర రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు తరగతులు చెబుతారని తెలిపారు. ఈ క్లాసులను జయప్రదం చేయటానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని జెవివి కార్యకర్తలందరూ కషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి నగర అధ్యక్షులు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి గాంగే నాయక్, కార్యదర్శి వర్గ సభ్యులు రామకష్ణ, ప్రసాద్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుపై విచారణ జరుపుతున్న రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ హరిప్రసాదరెడ్డి

ప్రజల వద్దకే సమాచార కమిషన్

రాష్ట్ర సమాచార కమిషనర్ హరిప్రసాద రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాచార హక్కు చట్టం కేసుల పరిష్కారానికి పేదలైన అర్జీదారులు మంగళగిరిలోని కమిషన్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పనిలేకుండా ప్రజల వద్దకే సమాచార కమిషన్ వస్తోందనిరాష్ట్ర సమాచార కమిషనర్ హరి ప్రసాద రెడ్డి తెలిపారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్ర సమాచార కమిషనర్ మంగళ, బుధవారాల్లో రెండు రోజుల జిల్లా పర్యటనలో పాల్గొన్నారు. బుధవారం నాడు కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో పెండింగ్‌లో సమాచార వితరణలో విఫలమైన కేసుల్లో అప్పీళ్లపై విచారణ చేపట్టారు. మొత్తం 28 ఫిర్యాదులను విచారించి విద్యుత్ శాఖకు చెందిన రెండు కేసుల్లో అర్జీదారులకు ఫిర్యాదుకు రూ.2,500 చొప్పున మొత్తం రూ.5,000 పరిహారం చెల్లించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన మరో 9 కేసుల్లో సమాచార వితరణకు జరిగిన ఆలశ్యంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వివరణ సహేతుకంగా లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధికి దూరం అవుతున్న చేనేతలు

ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలి

'సందర్భం' సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆ వృత్తికే దూరం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో 'సందర్భం సమాలోచన'లో చేనేత కార్మికుల సమస్యలపై నిర్వహించారు. ఈ సమావేశానికి ధర్మవరం నుంచి వచ్చిన పలువురు చేనేత కార్మికులు వారి సమస్యలను తెలియజేశారు. చేనేత కార్మికుడు లోకేష్ మాట్లాడుతూ గతంలో ఏనాడూ చూడనంత బాధలు చేనేత కార్మికులు ఈరోజుల్లో చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో ఆదాయం లేకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేక చేనేత కార్మికుడు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. నాలుగు నెలలుగా చేనేతలో ఎటువంటి ఆదాయం లేదన్నారు. పవర్‌లూమ్స్‌ను నియంత్రించి చేనేత రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ముడిసరుకు ధరలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్కో మాజీ ఎండి రమణ మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకునే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. చేనేత రక్షణ చట్టాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, బాషా, రైతుసంఘం నాయకులు శివారెడ్డి, జెవివి నాయకులు గాంగే నాయక్, ప్రసూన, లక్ష్మీనారాయణ, రెడ్స్ భానుజా, సమావేశం సమన్వయకర్తలు నిస్సార్, బాబుద్దీన్, చేనేత కార్మికులు లోకేష్, గంగాధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సందర్భం సమాలోచనలు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

వైసిపి పాలనపై జనం విసుగు : టిడిపి



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చిన టిడిపి గెలవడం ఖాయం అని ఆ పార్టీ జిల్లా నాయకులు సరిపూటి రమణ, నగర అధ్యక్షుడు మారుతికుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం టిడిపి నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి అధినేత నారాచంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోపై వైఎస్ఆర్‌సిపి నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పార్టీ టిడిపి అన్నారు. రాబోవు రోజుల్లో పేదలు, మహిళలు, నిరుద్యోగులు, బడుగుబలహీన వర్గాల ప్రజలకు టిడిపి అండగా ఉంటుందన్నారు. వైసిపి చౌకబారు విమర్శలు మానుకుంటే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, మాజీ కార్పొరేటర్లు నాటేష్‌చౌదరి, జానకి, ముక్తియర్, హౌన్నూర్, గోపాల్ గౌడ్, కుళ్లాయప్ప, బాలప్ప, పరుసురాం పాల్గొన్నారు.

2న ఉచిత వైద్యశిబిరం

గుమ్మఘట్ట : మండల పరిధిలోని 75-వీరాపురం గ్రామంలో జూన్ 2న స్థానిక జడ్‌పిహెచ్ స్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వీ ట్రస్ట్ అధినేత విజయకుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలోని అమీలియా ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి తర్వాత కంటి ఆపరేషన్ చేసి, మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందులో గుండె, మోకాళ్ల నొప్పులు, ఇతర సమస్యలకు చికిత్స చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309257566 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



అనంతపురంలో పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వీరబ్బాయి ఆధ్వర్యంలో పొగాకు సంబంధింత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో వాడినా ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుందన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల పరిధిలో సిగరెట్, పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం అధికారులు, వైద్యులు, ప్రజాప్రతి నిధులు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి తెలుగుతల్లి కూడలి వరకు కొనసాగింది. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నారాయణ స్వామి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లలితకుమారి, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, ఫ్యామిలీ ఫిజిషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ గంగాధర్ రెడ్డి, డెమో భారతి, త్యాగరాజు, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఎన్జీఓ సిబ్బంది, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటర్ రమేష్‌రెడ్డి, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ : పొగాకు ఉత్పత్తుల వినియోగం మానవ మనుగడకే ప్రమాదమని విడపనకల్ మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి ప్రభుత్వ వైద్యాధికారి హరినాథ్ రెడ్డి, క్రాంత్ బాబు, ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల వైద్యాధికారి వెంకటేష్ నాయక్ పేర్కొన్నారు. పెద్ద కొట్టాలపల్లి, రాకెట్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నాగభూషణ్, ఆరోగ్య విస్తరణాధికారి తిరుపాల్ నాయక్, సిహెచ్‌ఓ నాగ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ, సిబ్బంది రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో పొగాకు దినోత్సవంపై ర్యాలీ నిర్వహిస్తున్న దశ్యం

ఆత్మకూరు : స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు, ధూమపానం వల్ల కలిగే దుష్పరిణామాలపై వైద్యులు అవగాహన కల్పించారు. అలాగే పొగాకు దుష్పరిణామాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబీహ సుల్తానా, ఎంపీహెచ్‌ఈఓలు నాగేశ్వరయ్య, మునాఫ్, పీహెచ్‌ఎన్ తులసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఓ.పి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

పెద్దపప్పూరు : స్థానిక పిహెచ్‌సి డాక్టర్ ఎ.కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దపప్పూరులో పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎండి.షర్మాన్ వలి, ఎల్.నాగరత్న, ఆరోగ్య పర్యవేక్షకులు షారోన్, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు, రక్తపోటు, గుండెపోటు సంభవిస్తాయని, కావున పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి బాలాజీ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీధర్, సూపర్‌వైజర్లు రవికుమార్, ఆదిలయమ్మ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : పొగాకు ఉత్పత్తుల వినియోగిస్తే అనారోగ్యానికి గురవుతారని వైద్యాధికారి డాక్టర్ అనూష దేవి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై కుందుర్పిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అలాగే పొగాకు ఉత్పత్తులను వ్యతిరేకిస్తూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చాంద్ బేగం, ఆరోగ్య సిబ్బంది రంగస్వామి, శశికళ, నరసింహారావు, జ్ఞాన ప్రకాష్,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఎఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి విజయమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేద్దాం

మాజీ ఎమ్మెల్యే విశ్వ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ



బహిరంగ సభలో మాట్లాడుతున్న విశ్వ

వైసిపి విజయమే లక్ష్యంగా జగన్‌ను మరోసారి సీఎం చేసుందుకు సైనికుల్లా పని చేద్దామని ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైసిపి కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటి నిలిచిన సీనియర్ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వతో పాటు గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్, పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్ రెడ్డి, బిసి విభాగం జిల్లా అధ్యక్షులు సిపి వీరన్న, ఎపీ వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ జగన్ హయాంలో నియోజకవర్గానికి వివిధ సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలు ద్వారా రూ. 3వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ పేదరికం పోగొట్టి ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతూ సుస్థిరపాలన చేస్తున్నారని కొనియాడారు. అయితే చంద్రబాబు అధికార దాహంతో మరోసారి తన హామీలతో ప్రజలను నమ్మించి వంచించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడిన ప్రతి మాట పచ్చి అబద్ధమన్నారు. వైసిపిలో కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లోనూ పనులు చేపట్టాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-గుత్తి



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న ఛైర్‌పర్సన్ వన్నూరుబీ

మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల్లో మాత్రమే అభివద్ధి పనులు చేసేందుకు అజెండాలో పొందుపరిచారని అన్ని వార్డుల్లో సమానంగా పనులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక సంఘంలోని సభా మందిరంలో బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి. వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని పలు అంశాలపై సభ్యులు మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధి లోని అన్ని వార్డుల్లో సమస్యలు నెలకొన్నా అధికారులు కొన్ని వార్డుల్లోనే అభివృద్ధి పనులు చేసేందుకు అజెండాలో అంశాలు పొందుపరిచారని వైస్ ఛైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు రూపావతి, ఫారూఖ్, వాల్మీకి శివ, రమణ ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించకపోవడంతో వార్డుల్లో తిరగలేకపోతున్నామని వాపోయారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు ఫారుక్, ఖాజాఖాన్ వాల్మీకి శివ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డిఇ ఇంతియాజ్, ఎఇ శరత్ చంద్ర, మేనేజర్ మురళీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, ఆర్‌ఓ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల: మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం కింద 2023-24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నిర్మలకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద మామిడి, సపోట, జామ, అల్ల నేరేడు, దానిమ్మ, చీని, సీతాఫలం, మునగ, తదితర పండ్లు, మొక్కలు, మల్లె, గులాబీ వంటి పూల మొక్కలు సాగు చేసుకోవచ్చు అన్నిరు. పండ్ల తోటలకు మూడేళ్ల వరకూ, పూల తోటలకు రెండేళ్ల వరకూ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులు, చిన్న, సన్నకారు రైతులు రెవెన్యూ అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్ జత చేసి సంబంధిత గ్రామపంచాయతీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా అప్లికేషన్‌ను 3 రోజుల్లో పంపాలని తెలిపారు.

అక్రమ కొళాయి కనెక్షన్లు తొలగించుకోండి

నార్పల: నార్పల మేజర్ పంచాయతీలో అనుమతి లేకుండా కొళాయి కనెక్షన్ తీసుకుని ఉంటే మూడు రోజుల్లో తొలగించుకోవాలని, లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని పంచాయతీ కార్యదర్శి అశ్వత్తనాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా కొళాయి వేసుకున్న వారు 3 రోజుల్లోపు పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి రశీదు పొందాలని సూచించారు. లేనిచో కొళాయి కనెక్షన్ తొలగించడంతో పాటు అపరాధ రుసుం విధించి, పంచాయతీ రాజ్ చట్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు : మండల కేంద్రమైన రాప్తాడులో బుధవారం తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పండమేటి రాయుడు నూతన ఆలయం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దేవాదాయ శాఖ నుంచి రూ. కోటి మంజూరు చేయించారు. దీంతో ముఖ్యఅతిథిగా హాజరైన రాజశేఖర్‌రెడ్డి నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో ఓ చిత్తుకాగితం

వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్



విలేకరులతో మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

మహానాడులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు చిత్తుకాగితం అని ఎద్దేవా చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య విమర్శించారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని జీవీపీ కాలనీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తూ ప్రజలందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారన్నారు. గతంలో చంద్రబాబు ప్రజలను వంచించడంతో, మహానాడులో టిడిపి మినీ ఎన్నికల మేనిఫెస్టోను రాష్ట్ర ప్రజలు టిష్యూ పేపర్ కంటే హీనంగా చూస్తున్నారన్నారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేని దశలో టిడిపి ఉందన్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు పాకులాడే చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. జగన్ ఒంటరిగానే పోటీ చేసి మరోమారు విజయం సాధించడం ఖాయమని తెలిపారు. ఇతర పార్టీల పథకాలను కాపీ కొట్టి, మేనిఫెస్టోలో ప్రకటించారని, వీటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సొంత పార్టీ వారే ఈ మేనిఫెస్టోను నమ్మడం లేదన్నారు. ప్రజలకు అన్ని రకాల సేవలను సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ చేరువ చేసిన జగన్‌కే ప్రజలు మరోమారు పట్టం కట్టడం ఖాయమని పైలా ధీమా వ్యక్తం చేశారు. ఆయనతో పాటు వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు రంగనాథరెడ్డి, పార్టీ నాయకులు గురుప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్ ఉన్నారు.

కొలగానహళ్లిలో ప్రబలిన విషజ్వరాలు

పలువురు ఆసుపత్రిపాలు



కణేకల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని కొలగానహళ్లి గ్రామంలో విష జ్వరాలు ప్రబలినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషజ్వరంతో బాధప డుతున్న హరిజన గంగమ్మ, హరిజన సోము, కావలి సుశీలమ్మ, కావలి రాజన్న, కావలి గోవిందు, హరిజన వన్నక్క, ఉపేం ద్ర, హరిజన లక్ష్మి కణేకల్లు ఆర్‌డిటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు బళ్లారిలోని ఓపిడి, ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, కొందరు గ్రామంలోనే ఆర్‌ఎంపి డాక్టర్ల వద్ద చికిత్స పొందుతున్నారు. కావున అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలను విష జ్వరాల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యులను వివరణ కోరగా మా దష్టికి రాలేదని దాట వేశారు.

శింగనమల మార్కెట్‌యార్డ్ వైస్ ఛైర్మన్‌గా గీతాబాయి ఎన్నిక

శింగనమల : శింగనమల నియోజకర్గ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా గీతాబాయిని ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి ఎం.శ్రీనివాస్ నాయక్(బాబు), తాను కీలకంగా పని చేశామన్నారు. దీంతో తనను మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గా ఎన్నుకున్నందుకు సీఎం జగన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డి, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమెకు గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు జి.మల్లికార్జున్ నాయక్, శుభాకాంక్షలు తెలిపారు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకరయ్య సూచించారు. నగరంలోని కేఎస్ఎన్ కళాశాలలో బుధవారం విజన్ యూత్ అసోసియేషన్ నెహ్రూ యువ కేంద్రం అనంతపురం, కేఎస్ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకతి పట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రకతి పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ మన అందరి సామాజిక బాధ్యత అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రేణుకాదేవి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జయమారుతి, సభ్యులు నందిత, శీను, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు చొరవ చూపాలని కళ్యాణదు ర్గం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మప్ప సూచించారు. స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా విభాగం, అటవీశాఖ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటి, రాబోయే రోజుల్లో కళాశాల ఆవరణమంతా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమతో మరిన్ని మొక్కలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు కిరణ్, విజయ్ కుమార్, రఘు, ప్రశాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నారాయణ, గోవర్ధన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.6.40 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం : ఎంతో నమ్మకంగా పలకరించి మహిళలను మోసం చేసి బంగారు ఆభరణాలు దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.6.40 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్లు, నిద్ర మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ బివి.శివారెడ్డి, సిఐ విజయభాస్కర్ గౌడ్‌తో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా కోట మండలం శ్యామచంద్రాపురానికి చెందిన చేవూరి చంద్ర అలియాస్ చంద్ర బాబు ఒంటరిగా ఉన్న మహిళలతో పరిచయాన్ని పెంచుకుని తద్వారా వారింటికి వెళ్లి బంగారు ఆభరణాలు కాజేసేవాడు. ఇతనిపై పలు కేసులు నమోదు కావడంతో పోలీసులకు పక్కాగా అందిన సమాచారం మేరకు సిఐ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిందితున్ని అనంతపురం వద్ద బుధవారం అరెస్టు చేశారు. ఇతని నుంచి 6.40 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఆరుగురికి గాయాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అక్కన్నపల్లికి చెందిన 20 మంది కడప జిల్లా కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామంలో జరుగుతున్న క్రైస్తవ సువార్త ప్రార్థనలకు ట్రాక్టర్‌లో వెళ్లారు. ప్రార్థనలు ముగిసిన తర్వాత వారు స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో బొందలదిన్నె సమీపంలోకి రాగానే ఓ కారు వచ్చి ట్రాక్టర్ ఇంజన్‌ను ఢీకొట్టడంతో ట్రాలీ బోల్తా పడింది. దీంతో అందులో కూర్చున్న రామాంజినమ్మ, ప్రేమ్ కుమార్, అజయ్‌కు తీవ్రంగా గాయపడగా తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. స్వల్పంగా గాయపడిన గాయత్రి, మునెమ్మ, ఓబులేసుకు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: మండల పరిధిలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద 44-జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివారాల మేరకు.. వజ్రకరూరుకు చెందిన పోతన్న, రామలక్ష్మి దంపతులు ద్విచక్ర వాహనంపై గార్లదిన్నె మండలంలోని మర్తాడుకు వస్తుండగా తలగాచిపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గయపడ్డారు. వారిని వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే తిమ్మంపేట జాతీయ రహదారిపై ముందర వెళ్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టడంతో వెనుక కారులో కూర్చున్న బాలిక శ్రావణిశ్రీ తలకు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఆ బాలిక అనంతపురంలోని సవేరా హాస్పిటలలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

పెన్నఅహోబిలంలో ఉత్తర శిలాతోరణ ముఖద్వారం ప్రారంభం



ఉత్తర ముఖ ద్వారం ప్రారంభిస్తున్న దశ్యం

ఉరవకొండ: పెన్నఅహోబిలం లక్ష్మీనంసింహస్వామి దేవాలయంలో ఉత్తర ద్వారంలో నూతనంగా నిర్మించిన రాతి శిలాతోరణ ముఖద్వారాన్ని బుధవారం అర్చకుల వేదమంత్రాల నడుమ వైస్ ఎంపిపి శ్రీనాథ్ రెడ్డి, ఈఓ విజయ్ కుమార్, భీమిరెడ్డి ప్రారంభించారు. గార్లదిన్నె మండలంలోని ముకుందాపురం గ్రామనికి చెందిన ఓబిరెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నారపరెడ్డి సోదరులు రాతి ముఖద్వారానికి రూ.15 లక్షలు అందజేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు మయూరం బాలాజీ స్వామి, సత్యనారాయణ, సిబ్బంది మారుతి, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఎంబీఏ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

18 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ సుబ్బారావు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలోని శ్రీబాలాజీ పీజీ, ఎంబీఏ కళాశాలలో బెంగళూరు ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న హెటిరో డ్రగ్స్, కెనాలి ఫైనాన్షియల్ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 18 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా. సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎంబీఏ కోర్సు పూర్తి చేసిన వారు, చదువుతున్న వారు 160 మంది హాజరవగా 18 మంది ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనము రూ. 3.5 లక్షల నుంచి రూ. 4 లక్షలు అని, ట్రైనీ ఆఫీసర్స్, ఫైనాన్షియల్ సమన్వయకర్త హోదాలో పని చేస్తార ని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డా.పల్లె కిషోర్ అభినందించారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ పల్లె సింధూరరెడ్డి, ప్రాంగణ నియామకాల అధికారి బాబాఫకృద్దీన్, కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్లు సీమోను, సాయి, విభాగాధిపతి వై.సునీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష

నార్పల: మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి మహమ్మద్ రఫీ అధ్యక్షతన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నాడు-నేడు కింద చేపట్టిన 3 అంగన్వాడీ కేంద్రాలు, 22 పాఠశాలల్లో పనుల ప్రగతిపై సమీక్షించి వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండలానికి మంజూరైన 900 క్వింటాళ్ల విత్తన వేరుశగను రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఐసిడిఎస్‌కు సంబంధించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. జగనన్న తోడు లక్ష్యం పూర్తి చేయాలని నిర్దేశించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలను పెంచాలన్నారు. తాగు నీటి సమస్య ఏర్పడకుండా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందులో భాగంగా వ్యర్థ పదార్థాల సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో దివాకర్, తహశీల్దార్ నారాయణ స్వామి, ఈఓఆర్డి లక్ష్మీనరసింహ, ఎఇ ముస్తఫా, ఏపీవో ఓబన్న, ఏపీఎం తిప్పమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మధుమాలిని, ఉమాదేవి, విద్యాశాఖ అధికారి బ్రహ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంలో కొనసాగించాలి

జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రంగన్న

గుత్తి : డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంలో కొనసాగించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఎమ్ఎస్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జెవివి ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సైన్స్ విభాగంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడంతో విద్యార్థులు కీలక విషయాలను గ్రహించ లేకపోతున్నారన్నారు. శాస్త్రీయమైన సిద్ధాంతాలను పాఠ్యపుస్తకాల్లో కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, రామాంజనేయులు, యుటిఎఫ్ మండల కార్యదర్శి అహోబిలేసు, ఎస్‌టియు నాయకులు శివ శంకర్, న్యాయవాది విజయ భాస్కర్, హెచ్ఎంలు ప్రవీణ్ కుమార్, సలీం, ఉపాధ్యాయులు, ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



గుత్తిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం: నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, "పుట్టినిల్లు" ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నిర్మలమురళి పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు, విశ్రాంత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కురాకుల ప్రభుప్రసాద్ ఆయన తండ్రి కురాకుల రామచంద్రయ్య వర్ధంతి సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, కిష్టప్ప, ఓబుళపతి, చంద్రశేఖర్, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొడాలి నాని కాపులకు క్షమాపణ చెప్పాలి

అనంతపురం : కాపులపై కారుకూతలు కూస్తున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని కాపులకు తక్షణం క్షమాపణ చెప్పాలని రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షులు పాములరాయి వెంకటేష్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొడాలి నాని ఓ ప్రజాప్రతినిధి అయి ఉండి వీధి రౌడీలా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాపుల ఓట్లు అడగకుండా గెలవాలని సవాల్ చేశారు. కాపులు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు .

4న ప్రతిభా పురస్కారాల ప్రదానం

అనంతపురం రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న బాలాజీ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు. కావున 2022-23 విద్యా సంవత్సరం లో పదో తరగతిలో 550, ఆపైన మార్కులు సాధించిన అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాలకు చెందిన బలిజ విద్యార్థులు మార్కుల జాబితా, టి.సి లేదా క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు పాస్‌ఫొటోలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని ఆనందరావు పేట గ్రామంలో బసగాని లక్ష్మీదేవి, బసగాని ఆంజనేయులు దంపతుల కుమార్తె లలిత వివాహానికి బుధవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, సి.వెంకటేష్, పక్కీరప్ప, భాస్కర్, బండి పరుశురాం, బెస్త నారాయణస్వామి, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

దర్గాహొన్నూరులో రోడ్డు ఆక్రమణ

ఆధారాలు వెల్లడించిన కాలవ

రాయదుర్గం రూరల్ : బొమ్మనహాల్ మండల పరిధిలోని దర్గా హొన్నూరు ప్రధాన రహదారిని వైసిపి నాయకుడు ఆక్రమించి భవనాలను నిర్మించాడని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం ఆధారాలతో కూడిన వీడియోను విడుదల చేశారు. ఆ గ్రామ వైసిపి నాయకుడు మనోహర శెట్టి మెయిన్ రోడ్డును ఆక్రమించి బిల్డింగ్ నిర్మించాడన్నారు. ప్రస్తుతం అతని తల్లి స్థానిక ఎంపిటిసిగా మండల వైస్ ఎంపిపిగా ఉన్నారన్నారు. మనోహర్ నివాస గృహంతో పాటు ఫర్టిలైజర్ దుకాణం కూడా రహదారిని యథేచ్ఛగా ఆక్రమించి కట్టించారన్నారు. దర్గా హొన్నూరులో రఫీ అనే మైనారిటీ వ్యక్తి కుటుంబానికి జీవనాధారమైన హోటల్‌ను ఎలాగైనా తొలగించాలని నానా యాగీ చేస్తున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి అదే గ్రామంలో వైసిపి నాయకుడి రోడ్డు దురాక్రమణ కనపడలేదా అని కాలవ ప్రశ్నించారు. అధికార మదంతో పేదలపై ప్రతాపం చూపుతున్న ఎమ్మెల్యే తనపార్టీ నాయకుడి కబ్జాపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


రోడ్డు ఆక్రమించారని కాలవ విడుదల చేసిన చిత్రం

టిడిపి బీసీల పార్టీ

మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


అనంతపురంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

దాడులు, దౌర్జన్యాలు, ఆస్తి నష్టం, తదితర వాటితో ఇబ్బందులు పడుతున్న బీసీల కోసం టిడిపి అధినేత చంద్రబాబు "బీసీల రక్షణ చట్టం" ప్రకటించడం ద్వారా టిడిపి బీసీల పార్టీ అనిమరోమారు నిరూపించారని బీసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీ నరసింహులు, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన పథకాల పట్ల రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవళ్ల మురళి, జోన్-5 కోఆర్డినేటర్ నరసింహులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దాసరి శ్రీధర్, గంజే నాగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, వడ్డెర సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, కురుబ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, శాలివాహన రాష్ట్ర కన్వీనర్ పోతలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కురుగుంట బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి వడ్డే నాగేంద్ర, కురుబ యాదవ సాధికారిక కన్వీనర్ శివబాల, గాండ్ల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ విశాలాక్షి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు, తెలుగు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


కుందుర్పిలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

బ్రహ్మసముద్రం: టిడిపి మేనిఫెస్టోలో మహిళలకు అగ్రస్థానం ఇవ్వడం అభినందనీయమని టిడిపి యువనేత ఉన్నం మారుతి చౌదరి పేర్కొన్నారు.


బ్రహ్మసముద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మారుతి, తదితరులు

చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల పరిధిలోని భైరసముద్రం గ్రామంలో మారుతి చౌదరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసేకోవాలంటే కళ్యాణదుర్గం ఎమ్మెల్యేని 50 వేల మెజార్టీతో గెలిపించుకోవాలని కోరా రు. కార్యక్రమంలో విరుపాక్షిరెడ్డి, వెంకటేశులు, రాజశేఖర్ గౌడ్, చిత్తప్ప, సత్యనారాయణ, తిమ్మప్పచౌదరి, లింగన్న, బసవేశ్వర గౌడ్, తిప్పేస్వామి, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


కుందుర్పి: టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో తెలుగు తమ్ముళ్లు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి మల్లికార్జున, సీనియర్ నాయకులు రామాంజనేయులు, సజ్జల శ్రీనివాసులు, తిప్పేస్వామి, నాగేంద్ర, శ్రీనివాసులు, ఈరన్న, రాధాకృష్ణ, తెలుగు యువత జిల్లా నాయకుడు రామ్మూర్తి నాయుడు, నరసింహులు, జిల్లా దండోరా అధ్యక్షులు వైబి ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల: స్థానిక టిడిపి కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నార్పలలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

దండన శివానందకు సత్కారం

ఉరవకొండ: అఖిల భారత వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన దండిన శివానందను బుధవారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్ స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ శివానంద పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, తదితర రంగాల్లో సేవలు అందించారని కొనియాడారు. సొంత స్థలాలను ఇవ్వడమే కాకుండా భవన నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేశారన్నారు. ఆ సేవలకు ప్రతిఫలంగా ఈ పదవి దక్కిందన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.



దండిన శివానందను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి

బదిలీపై వెళ్తున్న ఏపీఆర్వోకు సన్మానం

అనంతపురం: అనంతపురం సమాచార పౌర సంబంధాల శాఖలో ఏపీఆర్‌వోగా పనిచేస్తున్న ఓం ప్రకాష్ రెడ్డి డిపిఆర్‌ఒగా పల్నాడు జిల్లాకు వెళు తున్న సందర్భంగా బుధవారం సాయంత్రం అనంతపురం సమాచార శాఖ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల అధికారి పి. గురుస్వామి శెట్టి, డిపిఆర్ఒ పి.రమేష్ బాబులు ఆయన్ను సన్మానించారు. ఓంప్రకాష్ రెడ్డిని ఏపీఆర్‌వో విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో తనకు సహాయ సహకారాలు అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఓంప్రకాష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పౌరసంబంధాల శాఖ సిబ్బంది

నాటుసారా విక్రేతలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం

గుత్తి : గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు మానేసిన వారితో పాటు పాత నేరస్తులకు ప్రభుత్వం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపుతామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. నాటుసారా కేసు నిందితులతో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే బసినేపల్లి, బసినేపల్లి తండా, గుత్తి పట్టణంలోని నాటుసారా విక్రేతలకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారీ, విక్రయమే వృత్తిగా చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ వత్తులు, వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సహిస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపిడివో చిత్రా శ్రీనివాసులు, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, సెబ్ సీఐ బి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ

గార్లదిన్నె: స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ షమీం తాజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురవుతారన్నారు. అనంతరం ప్రజల చేత పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు షామీన్ తాజ్, గౌతమి, ఎర్ర గుంట్ల పిహెచ్‌సి వైద్యాధికారులు దిలీప్, హనీష, లోకనాథ్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గార్లదిన్నెలో పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది